నెమలికి నెలవు.. నల్లమల



నాట్యంలో నెమలికి సాటి లేదు. పురివిప్పి ఆడే నెమలి అందాలను చూడ్డానికి ఎన్ని కళ్లైనా చాలవు. ప్రపంచంలో నాలుగు జాతులకు చెందిన నెమళ్లు ఉన్నాయి. వీటి శాస్త్రీయ నామం గ్రీక్ భాష ప్రకారం పావో- క్రిష్టాటస్(లైనీయిస్). వీటిలో నీలపు రంగు నెమళ్లు మనదేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్నాయి. ముఖ్యంగా నల్లమల నెమళ్ల స్థావరం. ఆకుపచ్చ రంగు నెమళ్లు తూర్పు, దక్షిణ ఆసియా దేశాల్లో ఉండేవి. ప్రస్తుతం ఇవి అంతరించిపోతున్నాయి. కాంగో జాతికి చెందిన నెమళ్లు మధ్య ఆఫ్రికాలో ఉన్నాయి. ఇక తెల్లని నెమళ్లు.. ఇవి పుట్టినప్పుడు పసుపు వర్ణంలో ఉండి పెరిగే కొద్ది తెలుపు రంగులోకి మారుతాయి. 1963 జనవరి 31వ తేదీన నెమలిని భారత ప్రభుత్వం జాతీయ పక్షిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా నెమలిపై ప్రత్యేక కథనం..

- 1963 జనవరి 31వ తేదీన జాతీయ పక్షిగా గుర్తింపు
- 1972లో నెమళ్ల సంరక్షణకై వన్యప్రాణి ప్రత్యేక చట్టం
- దేశంలో తగ్గినా నల్లమలలో ఆశాజనకమే..
- నేటితో జాతీయ పక్షికి 62 వసంతాలు పూర్తి

ఆత్మకూరు, జనవరి30: సాధారణంగా అడవుల్లో జీవించే నెమలి జీవిత కాలం 15 ఏళ్లు. జంతు ప్రదర్శనశాలలో ఉండే నెమలి సుమారు 23 ఏళ్లు జీవిస్తుంది. కానీ 8 నుంచి తొమ్మిదేళ్లకు మించి బతుకవని నల్లమల చెంచులు అంటారు. మగ నెమలి దాదాపు 7.4 అడుగుల పొడవు, సుమారు 107 సెం.మీ. పొడవుతో రెక్కలు కలిగి ఉంటుంది. 4.5 నుంచి ఐదు కేజీల బరువు ఉంటుంది. దీనికి 200 వరకు పింఛాలు ఉంటాయి. మగ నెమలితో పోల్చితే ఆడ నెమలి బరువు తక్కువగా ఉంటుంది. మగ నెమలి ఆడ నెమళ్లను ఆకర్షించేలా నాట్యమాడతాయి. మూడేళ్ల వయసులో మగ నెమళ్లకు పింఛాలు వస్తాయి. ప్రకృతిలో వచ్చే మార్పులను, వర్ష సూచనలను కూడా నెమలి ముందే గుర్తిస్తోంది. భూకంపాలను కూడా ముందే పసిగడతాయి. వ్యవసాయంలో రైతులకు నెమళ్లు మంచి మిత్రులు.



నెమళ్ల ప్రత్యుత్పత్తి పెరిగింది

నల్లమలలో నెమళ్ల ప్రత్యుత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. బైర్లూటి ఎకోటూరిజం పరిధిలోని సఫారీలో వెళ్లేటప్పుడు ఉదయం, సాయంత్రం వేళలో నెమళ్లు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. నెమళ్ల ఆహారానికి లోటు లేకపోవడంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదు. బట్టమేకపక్షిలాంటి అంతరించిపోతున్న పక్షుల సంరక్షణ కోసమే శాంక్చూరీలను ఏర్పాటు చేస్తున్నాము.

\- వి. సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

దేశంలో తగ్గినా..

మనదేశంలో ఇటీవల నెమళ్ల ప్రత్యుత్పత్తి తగ్గుతున్నప్పటికీ నల్లమలలో మాత్రం ఆశాజనంగా ఉన్నట్లు తెలుస్తోంది. నెమలి ఏటా రెండు, మూడు సార్లు గుడ్లు పెడుతుంది. ఒక్కో పర్యాయంలో 3నుంచి 6 గుడ్లను పెట్టి పొదిగి పిల్లల్ని పెంచుతోంది. కొత్తపల్లి మండలంలో కృష్ణానదీ తీర ప్రాంతంలో నెమళ్లు విస్తృతంగా సంచరిస్తుంటాయి. కొలనుభారతి క్షేత్రం, కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి, వెలుగోడు రిజర్వాయర్ సమీపంలోని గాలేరువాగు పరిసర ప్రాంతాల్లో నెమళ్లు అధికంగా ఉన్నాయి. భారత ప్రభుత్వం 1972లో నెమళ్ల సంరక్షణకై వన్యప్రాణి విభాగంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం ప్రకారం నెమళ్లను ఇళ్ల వద్ద పెంచడం నేరం. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోని రుద్రకోడూరు సమీపంలో నెమళ్ల సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో అటవీ అధికారులు ప్రకటించారు. కానీ ఆచరణలోకి రాలేదు.

అదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్



మాట్లాడుతున్న గఫూర్

నంద్యాల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అదానితో ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన జీపు జాతాను నంద్యాల పట్టణం గాంధీచౌక్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2020 అంటూ ప్రజలను మోసం చేశారని వ్యాఖ్యానించారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో చేతులెత్తేశారని విమర్శించారు. అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల కరెంట్ చార్జీలు పెరుగుతాయని అన్నారు. కాబట్టి ఆ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని అన్నారు. జీపు జాతా ప్రారంభంలో జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరాజు, జిల్లా కమిటీ సభ్యుడు పుల్లా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక సమావేశ మందిరంలో దేవస్థానం వైదిక కమిటీ, ఇంజనీరింగ్, పలు శాఖాధిపతులు, విభాగాల పర్యవేక్షకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో మహాశివరాత్రి ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో మెలగాలన్నారు. ప్రతిఒక్క ఉద్యోగి భక్తుల సౌకర్యాల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. దర్శన క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. ఇందుకు పోలీసుశాఖ సహకారం తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో అత్యవసర ద్వారాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు నుంచే క్షేత్రానికి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 26న జరిగే ప్రభోత్సవం, పాగాలంకరణ, కల్యాణోత్సవం, 27న రథోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలను దిగ్విజయంగా జరపాలన్నారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు అటవీశాఖతో సమన్వయమై నాగలూటి, పెద్దచెరువు, భీమునికొలను, కైలసద్వారం, సాక్షిగణపతి తదితర చోట్ల ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో రమణమ్మ, స్వామివార్ల ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయస్వామి, ఉమామహేశ్వరశాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

మెరిట్ జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఔట్‌సోర్సింగ్ ఎఫ్ఎన్‌వో పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 3 ఎఫ్ఎన్‌వో పోస్టులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ, ఎంపిక పూర్తి అయిందన్నారు. మెరిట్ జాబితాను కర్నూలు, నంద్యాల వెబ్‌సైట్‌లలో విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ 5 గంటల్లోగా కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారికి తెలియజేయాలని సూచించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

నంద్యాల కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రుణ ప్రణాళికను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్, ఈబీసీ,(కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు) వర్గాలకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించి వారికి సబ్సిడీపై రుణాలను మంజూరు చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రకటించారు. 21 నుంచి 61 ఏళ్ల లోపు వయసు కలిగి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీసీలు, ఈబీసీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 7వ తేదీలోగా ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు రాక

నంద్యాల, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): శాప్(ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) చైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం నంద్యాల జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు ఆళ్లగడ్డలోని క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించి ఆ తర్వాత మధ్యాహ్నం నంద్యాల పట్టణంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని సందర్శించనున్నారు. అనంతరం డీఎస్ఏ సిబ్బందితో సమావేశం. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు ఆత్మకూరులోని క్రీడా వికాస కేంద్రంతో పాటు ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శిస్తారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ ఎం.ఏ షరీఫ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ, షరీఫ్ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమంపై తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మైనార్టీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా షాదిఖానాలు నిర్మించిన ఘనత టీడీపీదే అన్నారు.



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

అభ్యంతరాల మధ్య ఆమోదం

- సమస్యలపై ప్రశ్నించిన కార్పొరేటర్లు
- ముగిసిన బడ్జెట్, సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ ఎస్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి 2024-25 సవరణ బడ్జెట్, 2025-2026 ప్రతిపాదన బడ్జెట్‌కు నగర పాలక కౌన్సిల్‌లో ఆమోదం లభించింది. గురువారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సవరణ, ప్రతిపాదన బడ్జెట్‌ను అకౌంట్స్ విభాగం అధికారి మల్లికార్జున చదివి సభ్యులకు వినిపించారు. ఇందులో భాగంగా కొందరు కార్పొరేటర్లు బడ్జెట్‌పై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అస్సలు బడ్జెట్‌లో కొన్ని విషయాలను ఎందుకు చేర్చారని కొందరు లేవనెత్తారు. కాలనీలలో పార్కులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు. అదేవిధంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలని సభా దృష్టికి తీసుకువచ్చారు.

మిగతా 7వ పేజీలో

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు వేణుగోపాల్ రెడ్డి




మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

నంద్యాల కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల్యవివాహాలను నిర్మూలించేందుకు కృషి చేయాలని స్త్రీ,శిశు సంక్షేమశాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం నంద్యాల ఎన్జీఓస్ కాలనీలోని కోఆపరేటివ్ ఫంక్షన్ హాలులో బాల్యవివాహాల నియంత్రణ, కిశోర వికాసం, మిషన్ వాత్సల్య తదితర కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారి, యూనిసెఫ్ బాలల రక్షణ అభివృద్ధి అధికారి మురళీకృష్ణ, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ అధికంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని జిల్లాల్లో వర్క్ షాప్‌లు నిర్వహించి బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 1,663 అంగన్వాడీ కేంద్రాల్లో 33 శాతం పిల్లలు వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేకుండా ఉన్నారన్నారు. జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆర్డీఓలు చల్లా విశ్వనాథ్, నరసింహులు, నాగజ్యోతి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిధులివ్వకపోతే నిర్వహణ ఎలా...?

ఆత్మకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలో ఫిబ్రవరి 2వ తేదీన అమ్మవారి జయంతిని పురస్కరించుకుని జరిగే వసంత పంచమి వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పలు సందర్భాల్లో వసంత పంచమి వేడుకలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి మంజూరు కాకపోవడంతో ఆలయ ఆదాయం నుంచే ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఉత్సవం ఏర్పాట్లపై ఈ నెల 21వ తేదీన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి సమక్షంలో ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయితే నిధుల కొరత కారణంగా ఏర్పాట్లు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జరిగే వసంత పంచమి వేడుకలకు సుమారు 20 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే భక్తుల సౌకర్యార్థం అక్కడ కల్పించాల్సిన కనీస ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం పైసా నిధులు కూడా విదిల్చలేదు. దీనికితోడు ఉత్సవంలో ఆయా శాఖల ద్వారా సదుపాయాల కల్పనకు కూడా తమ వద్ద నిధుల్లేవని సంబంధిత అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో చేసేదేమిలేక ఆలయ ఆదాయం నుంచే కొంత మేర ఖర్చు చేసి మొక్కుబడిగా వేడుకను ముగించేలా దేవస్థానం అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ ఖర్చును కూడా వివిధ రూపాల్లో భక్తుల నుంచి వసూళ్లు చేయాలన్న ధోరణిలో ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇదే తరహాలో ఉత్సవ నిర్వహణకు ఖర్చు భక్తుల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసినట్లు తెలిసింది.


కొలనుభారతి ఆలయం


కొలనుభారతి క్షేత్రానికి చేరుకునే రహదారి దుస్థితి ఇలా


క్షేత్రంలో శుభ్రపరచని నీటి ట్యాంకులు

- 2న కొలనుభారతిలో వసంత పంచమి
- ఏర్పాట్లకు ఒక్క పైసా ఇవ్వని ప్రభుత్వం
- అమ్మవారి దర్శనానికి భారీగా తరలిరానున్న భక్తులు
- సదుపాయాలు లేక ఇబ్బంది పడే అవకాశం

ఏర్పాట్లు సజావుగా సాగేనా?

కొలనుభారతి క్షేత్రంలో ఫిబ్రవరి 2న జరిగే వసంత పంచమి వేడుకలకు దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. తాగు నీరు, వైద్య శిబిరాలు, క్యూలైన్లు, నీడ వసతి, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి. వాహనాల రద్దీ దృష్ట్యా పార్కింగ్, ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దే ఏర్పాట్లు చేయాలి. క్షేత్రంలో పుణ్య స్నానాలు ఆచరించే చారుఘోషిణి అధ్వానంగా మారింది. నీటి ప్రవాహం లేక మురికి కుంటలా దర్శనమిస్తోంది. దీంతో భక్తుల పుణ్య స్నానాలకు షవర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదిలావుంటే క్షేత్రానికి వెళ్లే రహదారిలో రెండు కి.మీ. మట్టి రహదారి దారుణంగా ఉంది. గతంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించినా అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వసంత పంచమి వేడుకకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది.



భక్తుల నుంచి వచ్చే ఆదాయంతోనే...

కొలనుభారతి క్షేత్రంలో జరిగే వసంత పంచమి వేడుకను భక్తుల నుంచి వచ్చే ఆదాయంతోనే పూర్తి ఖర్చులను భర్తీ చేసేలా దేవస్థానం అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం నుంచి పైసా నిధులు రాకపోవడంతో అమ్మవారి పేరిట బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు చేసి ఆ తర్వాత ఉత్సవంలో భక్తుల ద్వారా వివిధ రూపాల్లో వచ్చే ఆదాయాన్ని తిరిగి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని దేవస్థానం భావిస్తున్నారు. దాతల సహకారంతోనే అన్నదానం చేస్తున్నారు. వాస్తవానికి వసంత పంచమి వేడుకను పురస్కరించుకుని సుమారు 20 వేల మందికి పైగా భక్తులు క్షేత్రానికి తరలి వచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తుల నుంచి వచ్చిన హుండీ విరాళాలు, అక్షరాభ్యాసాలు, అర్చనలు, ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, ప్రసాద విక్రయాలు, క్షేత్ర పరిధిలో వివిధ అంగళ్ల ఏర్పాటుకు అనుమతి రుసుము తదితర రూపంలో భారీగానే ఆదాయం రానున్నప్పటికీ ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. దీంతో ఉత్సవ నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అయితే వేడుక నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులను కేటాయించకపోవడంతో ఆయా శాఖల ద్వారా భక్తులకు సదుపాయాలు కల్పించాలని దేవదాయ శాఖ అధికారులు కోరినప్పటికీ ఆయా శాఖలకు నిధుల కొరత ఉండటంతో వారు కూడా ఉత్సవ ఏర్పాట్లపై పెద్దగా దృష్టి సారించడం లేదని తెలిసింది. దీంతో వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.


క్షేత్ర పరిధిలోని సప్త శివాలయాలు


చారుఘోషిణి నది దుస్థితి ఇలా..?

దేవస్థానం నిధులతో ఉత్సవం నిర్వహిస్తాం

వసంత పంచమి ఉత్సవాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతా సొమ్ము నుంచే ఖర్చు చేస్తున్నాం. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో కొత్తపల్లి ఎస్‌బీఐ ఖాతాల్లో అమ్మవారి పేరిట ఉన్న రూ.4 లక్షలను ఉత్సవ నిర్వహణకు ఖర్చు చేయాలని భావిస్తున్నాం. ఉత్సవం పూర్తయిన తర్వాత ఆర్జిత సేవల తరఫున వచ్చే సొమ్మును తిరిగి అమ్మవారి ఖాతాకు జమ చేస్తాం. అదేవిధంగా ఆయా శాఖల ద్వారా భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులను కోరాం.

- రామలింగారెడ్డి, కొలనుభారతి దేవస్థానం ఇన్‌చార్జి ఈవో

భారతీయులంతా ఒకే కుటుంబం

- టీకేఆర్ శర్మ నిస్వార్థ దేశ భక్తుడు
- మాజీ ఎంపీ టీజీ


కేవీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్

కర్నూలు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వంలా భారతీయులందరూ ఒకే కుటుంబమని, వారిని ఎవరూ విడదీయ లేదని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవ సాహితీ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కురాడి చంద్రశేఖర్, క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్‌లతో కలిసి గాంధీ, ప్రకాశం పంతులు, పీవీ నరసింహారావు, టీకేఆర్‌శర్మ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఎంతో మేధో సంపత్తి ఉన్నవారికి కూడా కులం అంటగట్టడం భావ్యం కాదన్నారు. విద్యార్థులు కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెంది సమాజ హితానికి పాటు పడాలని సూచించారు. ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవం జరుపుకోవడం ద్వారా వారి స్ఫూర్తిని ఈ తరానికి అందజేస్తున్నామని అన్నారు. కురాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్ముడు అంటే మహాశక్తి, ఒక వ్యవస్థ అన్నారు. ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధించిన వ్యక్తి మహాత్మాగాంధీ అని కొనియాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా, జయప్రకాష్, సంజీవరెడ్డి, టీకేఆర్ కృష్ణ మూర్తి, డాక్టర్ పార్వతీ దేవి, సుబ్బలక్ష్మి, ఎల్లమర్తి రమణయ్య పాల్గొన్నారు.

రేపు ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవనంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్, ఆదోని, కర్నూలు, పత్తికొండ డివిజన్ సంబంధించిన రెవెన్యూ కార్యవర్గ సభ్యులు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్ రెవెన్యూ అసోసియేషన్‌లో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయడంలో ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఫలమయ్యారని కొందరు ఉద్యోగులు రాష్ట్ర, జిల్లా అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం జరిగే సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి కార్యవర్గంలో పలు మార్పులు చేయనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ రాత పరీక్షలో 4,390 మందికి అర్హత

కర్నూలు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల అభ్యర్థులకు గత 18 రోజులుగా జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలో 4,390 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. గత డిసెంబరు నెల 28వ తేదీ నుంచి పరీక్షలు జరుగగా 10,350 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 6,806 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,242 మంది దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించలేకపోయారు. 174 మంది రిజక్ట్ అయ్యారు. 3,549 మంది గైర్హాజరైనట్లు పోలీస్ శాఖ అధికారులు వెల్లడించారు.

కుంభమేళాలో నంద్యాలవాసులు

- తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ జాం
- వీడియో వైరల్‌తో ఉలికిపాటు... అందరూ సేఫ్

నంద్యాల, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని మహాకుంభ మేళాలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇదే కుంభమేళాకు నంద్యాల జిల్లాకు చెందిన 40 మంది ప్రయాణికులు, ముగ్గురు వంట మాస్టర్లు వెళ్లారు. అయితే తిరుగు ప్రయాణంలో సదరు ట్రావెల్ బస్సు సమన్వయ్‌పార్క్ నుంచి జాన్‌పూర్ వరకు ఏర్పడిన ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయింది. ఈ విషయాన్ని సదరు బస్సులో వెళ్లిన ముగ్గురు వంట మాస్టర్లు సంపంగి పుష్పయ్య, వీరమణికంఠ, మోహన్ వీడియోను వైరల్ చేశారు. రెండు రోజులుగా ఇదే ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. దీంతో అక్కడికి వెళ్లిన వారి కుటుంబ సభ్యుల్లో కొంత ఆందోళన కలిగింది. ట్రావెల్ యజమాని మాత్రం అందరూ సేఫ్‌గా ఉన్నారని గురువారం రాత్రి బయల్దేరుతున్నట్లు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఇదిలా ఉండగా బస్సులోని ప్రయాణికుల్లో నంద్యాలకు చెందిన 18 మంది, హైదరాబాద్‌కు చెందిన 22మంది, ముగ్గురు వంటమాస్టర్లు ఉన్నారు.

చిచ్చర పిడుగులు

- బరిలో దిగితే పతకం పట్టాల్సిందే..
- క్రీడల్లో రాణిస్తున్న పేద విద్యార్థులు


హోరాహోరీగా జరుగుతున్న బాలుర పోటీ

సామాన్య రైతు కుటుంబానికి చెందిన క్రీడా ఆణిముత్యాలు నేడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ దేశానికి బంగారు పతకాలు సాధించి పెడుతున్నారు. తల్లిదండ్రులు పొలం పనులు, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ తమ పిల్లల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. నంద్యాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


రసవత్తరంగా సాగుతున్న మణిపూర్-ఢిల్లీ జట్ల మధ్య పోరు

నంద్యాల వైద్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) నంద్యాలలో రెండు రోజుల నుంచి జాతీయ స్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్నాయి. రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం నేతృత్వంలో ఐదు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. జాతీయ క్రీడాకారుల ఆట కనువిందు చేస్తోంది. అలవోకగా రివర్స్ కిక్, రోలింగ్ కిక్‌లను చూసి క్రీడాభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఒక్కొక్కరు పదుల సంఖ్యలో జాతీయ స్థాయి పోటీల్లో, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని టోర్నమెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. బీహార్, హర్యానా, మణిపూర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ జట్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. బాలుర, బాలికల విభాగాల్లో మణిపూర్ జట్ల ఆట తీరు క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించాలి



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు కవిత ఓంబీష్, వ్యవసాయ పనులు చేసుకుంటూనే మమ్మల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. 14సార్లు జాతీయ చాంపియన్ షిప్, మూడు సార్లు అంతర్జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాను. జాతీయ స్థాయిలో ఐదు గోల్డ్‌మెడల్స్ సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో సౌత్ ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించాను. అలాగే థాయ్‌లాండ్, నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను. - మోనిక, (హర్యానా)

పోలీస్ ఆఫీసర్ ఉద్యోగమే లక్ష్యం



2017 నుంచి ఈ ఆట ఆడుతున్నాను. 14 సార్లు రాష్ట్ర స్థాయి, 12 సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మూడు సార్లు, సబ్‌జూనియర్ మూడు సార్లు, జూనియర్ మూడు సార్లు, సీనియర్ విభాగంలో మూడు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించాను. తల్లిదండ్రులు సత్యనారాయణ, దుర్గాదేవి. చిన్నవ్యాపారం చేసుకుంటూ నన్ను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. బీహార్, పంజాబ్‌లలో జరిగిన పోటీలు తీపి గుర్తులు. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుకుంటున్నాను. ఉన్నత విద్య అభ్యసించి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఆఫీసర్ అవడమే లక్ష్యం.

- గోపిరెడ్డి రోహిత,,(తూర్పుగోదావరి)

ఇండియాకు ఆడాలని ఉంది



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు లక్ష్మి, చెన్నప్పలు. పొలం పనులు చేసుకుంటూ నన్ను చదివిస్తున్నారు. పనుల్లేనపుడు రాజంపేటకు వలస వెళ్లి కూలలి పనిచేసుకుంటూ నన్ను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని టోర్నమెంట్లు ఆడలేకపోయాను. స్నేహితుల ఆర్థిక సహాయంతో నాలుగు సార్లు పోటీల్లో పాల్గొన్నాను. క్రీడపై మక్కువతో ఆడుతున్నాను. రెండు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. జాతీయ స్థాయిలో బ్రాంజ్‌మెడల్ సాధించాను. ప్రస్తుతం బీబీఏలో ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాను. ఐదు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 9వ తరగతి నుంచి సెపక్‌తక్రా ఆటలో ప్రావీణ్యం సాధించాను. దాతలు సహకరిస్తే భారతజట్టు తరఫున ఆడాలని ఉంది.

- ఎం.వీరాంజి (ఆలూరు)

ఆర్థిక ఇబ్బందులు బాధించాయి



మొదట సెపక్‌తక్రా ఆడేందుకు ఆర్థిక ఇబ్బందులు బాధించాయి. ప్రతిభ ఉన్నా టోర్నమెంట్‌లో ఆడలేకపోయాను. తల్లిదండ్రులు ధర్మేంద్ర ఉపాధ్యాయ, మంజుదేవి పాట్నాలో ఉంటూ క్రీడల్లో పోత్సహిస్తున్నారు. నాన్న సేల్స్‌మెన్ ఉద్యోగం చేస్తూ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అన్న సెపక్‌తక్రా క్రీడ ద్వారానే స్పోర్ట్స్ కోటాలో గయలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ పోటీలు, మలేషియాలో వరల్డ్‌కప్, థాయ్‌లాండ్‌లో రెండుసార్లు, నేపాల్‌లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించాను. ఇంటర్ పూర్తి చేశాను. ఆటకోసం ప్రత్యేక క్రీడా పాఠశాలలో చేరేందుకు ఆలోచిస్తున్నాను. ఏషియన్ గేమ్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను.

- బాబికుమార్ (బీహార్)

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



సెపక్‌తక్రా క్రీడలో 6వ తరగతి నుంచి సాధన చేస్తున్నాను. 13 సార్లు రాష్ట్ర స్థాయి, 11 సార్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మాధవరెడ్డి, మమతలు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. కోచ్ శ్రీనివాసులు ప్రోత్సాహంతో సెపక్‌తక్రా క్రీడలో రాణిస్తున్నాను. ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను పోషిస్తాను.

- మధులత (ఒంగోలు)

జాతీయ సెపక్‌తక్రా విజేతలు


బాలుర విభాగంలో విజేత మణిపూర్ జట్టు

నంద్యాల వైద్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో టీమ్ ఈవెంట్‌లో విజేతలను టోర్నమెంట్ ఈఫ్ రెఫరీ బాల మురుగన్ (తమిళనాడు), బ్రిడ్జి మోహన్ సాహు (ఒరిస్సా)లు ప్రకటించారు. హోరాహోరీగా జరిగిన బాలుర ఫైనల్స్ పోటీలో మణిపూర్ జట్టు బీహార్ జట్టుపై 2-0పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో మణిపూర్ జట్టు నిలవగా, ద్వితీయ స్థానాన్ని బీహార్ జట్టు కైవసం చేసుకుంది. 3, 4 స్థానాలు సంయుక్త విజేతలుగా ఉత్తరప్రదేశ్, ఢిల్లీ జట్లు దక్కించుకున్నాయి. టీమ్ ఈవెంట్ బాలికల విభాగంలో ఫైనల్స్ పోటీలో మణిపూర్, హర్యానా జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా జరిగిన తుది పోరులో మణిపూర్ జట్టు హర్యానా జట్టుపై 2-0పాయింట్ల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో హర్యానా జట్టు నిలిచింది. 3, 4స్థానాల్లో సంయుక్త విజేతలుగా కేరళ, బీహార్ జట్లు దక్కించుకున్నాయి. గురువారం ఈ టోర్నమెంట్‌లో రెగో విభాగంలో పోటీలు నిర్వహించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

అభ్యంతరాల మధ్య ఆమోదం

● సమస్యలపై ప్రశ్నించిన కార్పొరేటర్లు ● ముగిసిన బడ్జెట్, సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, కురువ మునెమ్మ తదితరులు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

5వ పేజీ తరువాయి

● కూడళ్లలో ఉండే విగ్రహాలను మరిచిపోతున్నారని 50వ వార్డు కార్పొరేటర్ ఎస్టీ షేక్ అహ్మద్ ప్రశ్నించారు. ఎస్‌బీఐ కూడలిలో ఉండే వైఎస్ఆర్ విగ్రహాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా విస్మరించిందని అన్నారు. కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్డులో విద్యుత్ శాఖ అధికారులు పాత స్తంభాలను మార్చడంలో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. కరెంటు స్తంభాలు మార్చాలంటే డబ్బులు ఎవరు చెల్లిస్తారని కార్పొరేటర్ కమిషనర్‌ను అడిగారు. చెత్త తరలింపు వాహనాలు మరమ్మతులు గురైతే వాటిని తిరిగి తీసుకు రావడానికి కనీసం వారం రోజులు చేస్తున్నారని, దీని వల్ల ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోందని అన్నారు.

● కమ్యూనిటీ హాల్స్ నుంచి ఎంత అద్దె వసూలు చేస్తున్నారని 4వ వార్డు కార్పొరేటర్ అర్షియ పర్వీన్ ప్రశ్నించారు. ప్లే గౌండ్స్‌కు సంబంధించి ఎందుకు అద్దె రావడం లేదని అన్నారు. బిల్డింగ్ లైసెన్సు ఫీజులను ఎందుకు వసూలు చేయడం లేదని, అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని, వాటిని క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ సెక్రటరీలు అస్సలు పట్టించుకోవడం లేదని గత ఎనిమిది నెలలుగా నగరంలో శానిటేషన్ పూర్తిగా అటకెక్కింది. కేవలం సర్వసభ్య సమావేశాలు జరుగుతున్న తరుణంలో వారం రోజుల ముందర అధికారులు వార్డుల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తారు. ఆ తరువాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. త్వరలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తామని కమిషనర్ సమాధానం ఇచ్చారు.

● 20వ వార్డులోని 142 సర్వే నెంబరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అది కూడా వక్ఫ్‌బోర్డు స్థలమని దానిని రక్షించాలని స్థానిక కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.



పద్మలత



పరమేష్

● 17వ వార్డులో పార్కుల నిర్వహణ సరిగా జరగడం లేదని కార్పొరేటర్ క్లైప పద్మలతారెడ్డి అన్నారు. వార్డులో ఉండే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద అనవసరంగా ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనపడకుండా చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

● ఫ్లెక్సీల విషయంలో ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఎక్కడ బడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా కింది స్థాయి కార్యకర్తలు. నాయకులకు ప్రజాప్రతినిధులే చెప్పాలన్నారు.

● 20వ వార్డు, 48వ వార్డులో ఎలాంటి వీఎల్‌టీ చెల్లించకుండా, భవనాన్ని అనుమతి తీసుకోకుండా టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేశారని, దీని వల్ల నగర పాలక ఆదాయానికి సుమారు రూ.40 లక్షలు నష్టం వాటిల్లుతుందని 49వ వార్డు కార్పొరేటర్ సోంపల్లి క్రిష్ణకాంత్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

● మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. బడ్జెట్‌లో పండుగల నిర్వహణకు రూ.44 లక్షలు ఖర్చు చేశారని చెబుతున్నారు..ఏ పండగుకు చేశారని ఆమె ప్రశ్నించారు. విష్ణు టౌన్‌షిప్‌లో రోడ్డు ఆక్రమిస్తున్నారని, ప్రతి సారి సమావేశంలో చెబుతున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు.



షేక్ అహ్మద్



సుజాత

● నగర పాలక నూతన భవనాన్ని త్వరితగతిన పూ ర్తి చేయాలని 11వ వార్డు కార్పొరేటర్ యూనుస్‌బాషా కోరారు.

● ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుని ఆక్రమించు కుని వేసుకున్న దుకాణాలను తక్షణమే తొలగించాలని, వాటి వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలగడంతోపాటు ఆసుపత్రిలోపలికి అంబులెన్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొందని 16వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.

● పందిపాడు, అశ్వర్థపురం, లక్ష్మీపురం గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు జారీ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారాని కి చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ నారాయణ రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

● 13వ వార్డు నంద్యాల గేట్‌లో మున్సిపాలిటీ స్థలం ఉందని, ఆ స్థలంలో సచివాయాలు ఏర్పాటు చేస్తే అద్దె భవనాలకు అద్దె చెల్లించాల్సిన అవసరం ఉండదని కార్పొరేటర్ విజయలక్ష్మి కమిషనర్‌కు సూచించారు.

● గుత్తి పెట్రోలు బంకు వద్ద పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి సమస్య ఉంటే అక్కడికి వెళ్లానని, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్కడికి వచ్చారని, ఈ క్రమంలో అధికారిని సమస్య పరిష్కరించమని అడిగితే.. 'నీవెవరు నాకు కమిషనర్ ఉన్నాడు. సమాధానం చెబుతానని' చెప్పడం విడ్డూరంగా ఉందని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. 'స్థానిక కార్పొరేటరైనా నాకే ఈ విధంగా అధికారి సమాధానం చెబితే..నేను ప్రజాప్రతినిధినా...బ్రోకర్‌నా సమాధానం చెప్పాలి' అని అన్నారు. చిరు వ్యాపారుల వద్ద నేను డబ్బులు వసూలు చేస్తున్నానని అడిషనల్ కమిషనర్ చెప్పారు...దమ్ముంటే నిరూపిస్తే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



విజయకుమారి

త్వరలోనే నూతన భవనాన్ని పునఃప్రారంభిస్తాం

నగర పాలక నూతన భవనాన్ని త్వరలోనే పునఃప్రారంభిస్తాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లాం. 2024 ఏప్రిల్ 1కి ముందు పనులు ప్రారంభం కానివి, 25 శాతం లోపల అయినవి నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నగర పాలక పరిధిలో అలాంటివి మొత్తం 160 పనులు ఉన్నాయి. వాటిన్నంటినీ నిలుపుదల చేశాం. త్వరలోనే ప్రభుత్వ అనుమతితో రీ టెండరు పిలిచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. వాహనాల మరమ్మతులకు సంబంధించి సుమారు రూ.40 లక్షలు చెల్లించాం. త్వరలోనే మిగిలినవి కూడా చెల్లిస్తాం. సంస్కృతి పార్కులో కాంట్రాక్టర్ రుసుము ఎక్కువ వసూలు చేస్తున్నందుకు నిలిపివేశాం. త్వరలోనే పునఃప్రారంభిస్తాం. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బోర్డుకు దరఖాస్తు చేశాం. బోర్డు సభ్యులు వచ్చి గార్గేయపురం డంప్‌యార్డు వద్ద కుక్కల నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే అనుమతులు వస్తాయి.

- ఎస్.రవీంద్రబాబు, నగర పాలక కమిషనర్



సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న వెంకట శేషాద్రి

పత్తికొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో గురువారం సబ్‌జైలును కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. గురువారం పత్తికొండకు వచ్చిన ఆయన సబ్ జైలును సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సబ్‌జైలులో ఆర్వో, వాటర్ ప్లాంటు, మరమ్మతుల కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో పత్తికొండ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మన్న, ప్రభుత్వ వైద్యులు వెంకటేష్, న్యాయవాది నాగరాజు, కోర్టు సిబ్బంది రాజేంద్ర, ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

గోస్పాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దీబగుంట్ల గ్రామంలో ఉన్న బావిలోపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. శిరివెళ్ల మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పశువుల హుసేని (48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీనికి తోడు అప్పులు కూడా ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయిన హుసేని గురువారం దీబగుంట్లలో ఉన్న బావిలో శవమై కనిపించాడు. గోస్పాడు ఎస్ఐ వెంకట ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించి బంధువులకు తెలియజేశాడు. మృతునికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని..

మిడుతూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధి లోని వీపనగండ్ల గ్రామానికి చెందిన మంగలి జయరాముడు (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కొంత కాలం నుంచి జయరాముడు అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఈ క్రమంలోనే గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేశారు.

కిడ్నీ ఇప్పిస్తామని మోసం

● నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): కిడ్నీ ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితుడు బోయ నరసింహులును పోలీసులు అరెస్టు చేశారు. త్రీటౌన్ సీఐ శేషయ్య తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు తండ్రి నాగప్ప మూడేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. తరచుగా డయాలసిస్ చేయించుకునే సందర్భంలో గూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన నరసింహుడు అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిచయమయ్యాడు. తాను అనస్థీషియా టెక్నీషియన్ అని నమ్మించాడు. తనకు పెద్ద పెద్ద డాక్టర్లు తెలుసునని, రూ.3 లక్షలు ఇస్తే కిడ్నీ దాత ద్వారా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయిస్తామని నమ్మించాడు. ఈయన మాటలు నమ్మిన రమేష్ నాయుడు 2023 నవంబరులో రూ.3 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత కిడ్నీ ఇప్పించకుండా తప్పించుకుంటూ తిరుగుతుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

రూ.50 లక్షల భూమి కబ్జా

● ప్రభుత్వ స్థలంలో 'పులి రాజా' పాగా ● 30 సెంట్ల స్థలంలో బండలు పాతిన జనసేన నాయకుడు

ఆదోని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా భూ కబ్జాల పర్వం మాత్రం కొనసాగుతూనే ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ, ప్రభుత్వ, వంక, చెరువు భూములను ఆ పార్టీ నాయకులు కబ్జా చేస్తే నేడు అదే బాటలో కూటమి ప్రభుత్వానికి చెందిన జనసేన నాయకులు కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నారు. ఏకంగా రూ.50 లక్షల విలువ చేసే 30 సెంట్ల ప్రభుత్వ భూమిని జనసేన నాయకుడు పులి రాజా కబ్జా చేసి బండలు నాటేశాడు. జనసేన నాయకుడు మల్లప్పకు నోట్లో నాలుకలా ఉండే ఆయన భూకబ్జాకు పాల్పడడంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదోని మండలం అలసందగుత్తిలో సర్వే నెం. 149లో 24 ఎకరాల 44 సెంట్ల కొండ పోరంబోకు భూమి ఉంది. ఇక్కడ సెంటు రూ.3 లక్షలు పైబడి పలుకుతోంది. ఇదే సర్వే నంబరులోని గ్రామ నడి బొడ్డున రాముడు దేవాలయం పక్కన దాదాపు 30 సెంట్ల ప్రభుత్వ భూమిపై జనసేన నాయకుడు పులి రాజా కన్నువేశాడు. చెట్లు తొలగించి స్థలాన్ని చదును చేసి బండలు నాటి కబ్జా చేశారు. అడ్డొచ్చిన మహిళలపై దాడి కూడా చేశారు.



అలసందగుత్తిలో జనసేన నాయకుడు కబ్జా చేసిన స్థలం

ఫిర్యాదు చేశారు

పంచాయతీ తీర్మానం, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను జనసేన నాయకుడు స్థలాన్ని కబ్జా చేశాడంటూ, గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

- రమేష్, వీఆర్‌ఓ, ఆదోని

గ్రామంలో కొండ పోరంబోకులో ఉన్న ప్రభుత్వ భూమిని పులిరాజా కుటుంబ సభ్యులు కబ్జా చేసి బండలు నాటారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం



అలసంద గుత్తిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని తక్షణమే స్వాధీన పరుచుకుంటాం. ఆ స్థలానికి సంబంధించి ఎవ్వరికి కూడా పట్టాలు ఇవ్వలేదు. ఈ విధంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- శివరాముడు, తహసీల్దార్, ఆదోని

రుణాల పేరుతో మోసం

● ఇద్దరు నిందితుల అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత శక్తి ఫౌండేషన్ పేరుతో రుణాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు మారెన్న అలియాస్ విజయకుమార్, (సూదిరెడ్డిపల్లె, కర్నూలు), మహే జబీన్ (మహిళ, సూదిరెడ్డిపల్లె, కర్నూలు)లను అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరు కర్నూలు నగరంలో పలువురిని కేంద్ర పథకాల ద్వారా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించారు. వారి దగ్గర నుంచి రూ.29.70 లక్షలు నగదు వసూలు చేశారు. కొంత మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

స్థలం కబ్జా చేసిన వారిపై కేసు నమోదు

నంద్యాల క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని బర్మాశాల వీధిలో ఉన్న పది సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకోవడానికి వచ్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు గురువారం మూడో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కంబగిరి రాముడు తెలిపారు. గోనెగండ్ల ప్రభాకర్ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి డోజర్లతో ఇంటిని కూలుస్తామని బెదిరించిన లింగమయ్య, సయ్యద్ అలీ, భక్తుల కిషోర్, బుర్ర నరసింహులు, అన్నపురెడ్డి శాంసన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మూడో పట్టణ పోలీసులు హెచ్చరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

● పేదల జీవనోపాధికి వివిధ పథకాల అమలు ● నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): నాబార్డు ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పేదల జీవనోపాధి మెరుగుపడ టానికి వివిధ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి వివిధ అభివృద్ధి పథకాల కోసం ఏటా నాబార్డు రుణాలు అందిస్తున్నదని అన్నారు. ఆర్‌ఐడీఎఫ్ కింద గ్రామీణ రోడ్లకు 80 శాతం రుణాలను ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 20 శాతం మాత్రమే భరించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నిధులతో రాష్ట్రంలో 2,683 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1,086 కోట్లు కావాలని ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రూ.1,024 కోట్లతో 2,233 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ అధికారులు నాబార్డుకు ప్రతిపాదనలు పంపారన్నారు. గత ఐదేళ్లలో పాఠశాలల్లో అదనపు గదులు, టాయిలెట్లు, తాగునీటి కోసం రూ.6,066 కోట్లు నాబార్డు ద్వారా మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.1,133 కోట్లు రావాల్సి ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.5,331 కోట్లు మంజూరు కాగా, మరో రూ. 2,198 కోట్లు అందాల్సి ఉందన్నారు. బీసీ సాంఘిక, గిరిజన, మహిళా సంక్షేమం, వ్యవసాయం, ఫిషరీస్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలకు గత ఐదేళ్లలో నాబార్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.14,435 కోట్ల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు.

నీటి బకెట్లో పడి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు (ఫైల్)

ఆస్పరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలుడు ఆడుకునేందుకు వెళ్లి మృత్యువు ఒడికి చేరిన ఘటన మండలంలోని కైరుప్పల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వీరేష్, పవిత్ర దంపతులకు ఒక కుతూరు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు చంద్రశేఖర్ (4) తల్లి ఆరు బయట బట్టలు ఉతుకుతుండగా నిండుగా ఉన్న నీటి బకెట్లో పడ్డాడు. గమనించని తల్లి ఆలస్యంగా చూడగా అప్పటికే బాలుడు విగత జీవిగా మారాడు. నీటి బకెట్లో మృతి చెందిన కుమారుడిని చుసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి

● సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

మిడుతూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి కోరినట్లు వారు తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎత్తిపోతలకు సానుకూలంగా హామీ ఇచ్చారని వారు తెలిపారు. వీరి వెంట గుండం హరి సర్వోత్తమ రెడ్డి ఉన్నారు.

'స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి'



జీపు జాతాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పాణ్యం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగరాజు, బాలవెంకట్ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సంద్భంగా చేపట్టిన జీపుజాతా గురువారం పాణ్యం చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని, కడప స్టీల్ ప్లాంటును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను సీఎం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల నాయకులు భాస్కర్, ఆటో వర్కర్స్ సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, రాజు, చెన్నయ్య దావీదు, కాశీం పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

మహానంది, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో గురువారం రాష్ట్రస్థాయి వ్యవసాయ విద్యార్థుల క్రీడాపోటీలు కొనసాగాయి. చెస్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, లాంగ్ జంప్ క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమదైన ప్రతిభను చూపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి, స్టూడెంట్ యాక్టివిటీస్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఎల్. విజయభాస్కర్‌రెడ్డిలతో పాటు శాస్త్రవేత శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తిలకించారు.

'పాడి రైతుల అభివృద్ధికి కృషి'



గోకులాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సంధ్య

బండిఆత్మకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఏపీవో వసుధ అన్నారు. బండిఆత్మకూరులో గురువారం సర్పంచ్ సంధ్యతో కలిసి గోకులాన్ని ప్రారంభించారు. మండలంలో ఇప్పటి వరకు 15 కేంద్రాల నిర్మాణం పూర్తిఅయిందని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని ఈసీ వరదరాజులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మురళిరెడ్డి, టీఏ ప్రియస్వప్న పాల్గొన్నారు.

'రోడ్డు భద్రత నియమాలు పాటించాలి'

(శ్రీశైలం)ఆత్మకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర పరిధిలోని జీపు, ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు సూచించారు. గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు, రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలంలోని మల్లికార్జున సదన్‌లో గల మీటింగ్ హాల్ నందు ఆటో, జీపు డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు సమ క్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బంది శంకర్, రాజేంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, మహేష, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

నంద్యాల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల విభాగం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల విభాగం జిల్లా స్థాయిలో 8,9,10వ తరగతి బాలికలకు ప్రత్యేకంగా డిగ్నిటీ ఆఫ్ గర్ల్స్ అనే అంశంలో పోటీలు నిర్వహించిందని చెప్పారు. ఈ పోటీల్లో ఇంగ్లీష్ విభాగంలో ఎస్. కాత్యాయని ప్రథమ స్థానం, జి. హస్సిక రెడ్డి ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరికి డా.జి. రామకృష్ణా రెడ్డి, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డా. జి రవికృష్ణ, ప్రముఖ గైనకాలజిస్ట్ లక్ష్మీ సౌజన్య, అరుణకుమారిలు బహుమతులు ప్రదానం చేశారు.

గాంధీకి ఘన నివాళి



నందికొట్కూరులో..



బండిఆత్మకూరులో నివాళి అర్పిస్తున్న అధికారులు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

నంద్యాల కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నంద్యాల గాంధీ చౌక్ కూడలిలోని విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పిం చారు. అనంతరం చిరు వ్యాపారులకు అల్పాహారం పంపిణీ చేశారు. వాసవీసేవాదళ్ అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి. కాల్వ విజయశేఖర్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ఏవో శ్యామల, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి, ఏపీవో వసుధ, టీడీపీ నాయకుడు కొరకంచి శంకర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సి పల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్, వాణి పాల్గొన్నారు.

● మున్సిపాలిటీ కార్యాలయంలోని మహాత్ముడి దంపతుల విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.300 కోట్లతో మాస్టర్ ప్లాన్: ఎమ్మెల్యే బుడ్డా

మహానంది, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ అభివృద్ధికి రూ.300 కోట్లతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహానంది ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహానంది నుంచి ఎంసీ ఫారం వరకు ఉన్న 3 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణంతో పాటు పాలేరు వాగు వంతెన నిర్మాణానికి రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే మహానంది తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో మాట్లాడారు. తెలుగు గంగ లైనింగ్ పనుల విషయంపై మరో సారి సీఎంతో చర్చించి పూర్తి చేస్తామన్నారు. శ్రీశైలం, మహానంది క్షేత్రా లను ఒక కారిడర్‌గా చేసి కేంద్ర ప్రభుత్వ ప్రసాదం నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. సాయంత్రం యు.బొల్లవరంలో సీసీ రహదార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కేసీ కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్విని, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి, తెలుగు యువత లోక్‌సభ నియోజకవర్గ కార్యదర్శి క్రాంతికుమార్, మండల అధ్యక్షుడు మధు, టీడీపీ నాయకులు శ్యామల జనార్ధన్‌రెడ్డి, మల్లికార్జున, ప్రసాదరావు, రవినాథరావు, మహేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉమాదేవి, సరోజమ్మ పాల్గొన్నారు.



మహానందిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యలు పట్టవా?: ఎమ్మెల్యే గిత్తా

నందికొట్కూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని, పట్టణ ప్రజల సమస్యలు పట్టవా అంటూ నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ఒక్క రోజు కూడా సమావేశానికి వచ్చిన దాఖలాలు లేకపోగా ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సమావేశాలు నెలమరిచి నెల నిర్వహించడం బాగోలేదన్నారు. ఎక్స్‌అఫీసియో సభ్యుడి హోదా సమావేశానికి హాజరై మీరు చెప్పే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మున్సిపాల్టీలో ఏ సమస్య ఉన్నా లేఖ రూపంలో ఇస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ మాట్లాడుతూ షాపు నెంబర్ 1 అద్దె విషయంలో మెజార్టీ కౌన్సిలర్లు తిరస్కరిస్తే ఆవిషయాన్ని మినిట్స్ బుక్కులో ఎందుకు నమోదు చేయలేదని కమిషనర్ బేబిని ప్రశ్నించారు. 29వ వార్డు కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత 11 నెలలుగా ఎస్.ఎస్ ట్యాంక్ నుంచి మా కాలనీలో తాగునీరు రావడం లేదని, ఎందుకు రావడం లేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. కౌన్సిలర్ మందాడి వాణి మాట్లాడుతూ తమ పరిధిలోని గతంలో అనుమతులు లేని ఓ వెంచర్‌పై మున్సిపల్ అధికారులు దాడులు చేసి రాళ్లు తొలగించారని, కొంత కాలం తర్వాత అదే వెంచర్ యజమాని తిరిగి రాళ్లు పాతారని అన్నారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే వారు తిరిగి వెంచర్ వేశారా? ఎలాంటి అనుమతులు తీసుకోకపోతే ఎవరి ప్రోద్బలంతో తిరిగి వెంచర్ వేశారని అని ఆమె ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, చిన్నరాజు, చాంద్‌బాషా, నాయబ్, రావూఫ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

స్థలాలను అన్వేషించండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జంతువుల ఆశ్రయ నివాసాలకు స్థలాలను అన్వేషించాలని కలెక్టర్ రాజకుమారి కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జంతువుల పట్ల క్రూరత్వానికి నిరోధించు సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జేసీ విష్ణుచరణ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా. గోవిందనాయక్, ఇతర అధికారిక సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పశుసంపద ఆశ్రయ నిమిత్తం స్థలాలను గుర్తించాలని కమిటీ సభ్యులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న వీధికుక్కలకు కుటుంబ నియంత్ర ణ ఆపరేషన్ లు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల సంతల వివరాలు తెలుసుకుంటూ జిల్లాలో పశు సంపద అక్రమ రవాణాపై నిఘా పెట్టాన్నారు. పశు సంపద పరిరక్షణపై కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీలలో రోడ్లపై తిరిగే పశువుల నియంత్రణకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల బనగానపల్లె పట్టణంలో వీధి పశువులను చేపట్టిన అంశాలను కలెక్టర్ వివరించారు.

యువకుడి ఆచూకీ లభ్యం

నంద్యాల క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి వెళ్లిపోయి పోలీసులను పరుగులు పెట్టించిన యువకుడి ఆచూకీ లభ్యమైనట్లు నంద్యాల తాలుకా పోలీసులు గురువారం తెలిపారు. ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని, తల్లిదండ్రులను బ్లాక్‌మెయిల్ చేసి వారిని టెన్షన్‌కు గురిచేయడం తప్పని, తమ సమయం వృథా చేయడం తగదని పోలీసులు ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

దేవస్థానం ఈవోను కలిసిన వర్సిటీ సిబ్బంది

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావును చరిత్ర సంస్కృతి, పురావస్తుశాస్త్ర పీఠం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి, బోధన, బోధనేతర సిబ్బంది గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో అమల్లో ఉన్న కోర్సుల గురించి ఈవో ఆరా తీశారు. అలాగే విశ్వవిద్యాలయం తరుపున శ్రీశైల క్షేత్రంపై జరిగిన పరిశోధనలు, నిర్వహించిన సెమినార్లు, వెలువడిన గ్రంథాలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు ఆలయ విశేషాలు, ఆధ్యాత్మిక సమాచారం అందివ్వడానికి గైడ్‌లను ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. ఈవోను కలిసిన వారిలో పీఠాధిపతి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విశ్వనాథశాస్త్రి, మ్యూజియం కన్జర్వేటర్ మురళీధరరెడ్డి సిబ్బంది ఉన్నారు.

'జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం'

నందికొట్కూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఏ స్కీంలో చూసిన స్కామే కనిపిస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆరోపించారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలోని అప్పులు నేడు కూటమి ప్రభుత్వం పాలిట గుదిబండలా తయారయ్యాయన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, టీడీపీ నాయకులు ముర్తుజావళి, రజినీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

2న విగ్రహ ప్రతిష్ఠ

జూపాడుబంగ్లా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తూడిచర్ల మజారా గ్రామం శంకరమల్లయ్య కొట్టాల గ్రామంలో ఫిబ్రవరి 2న పోలేరమ్మ విగ్రహప్రతిష్ఠ మహోత్సవం ఉందని ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డా నాగమణి, మాజీ సొసైటీ ఉపాధ్యక్షులు దొడ్డసుధాకర్ భక్తబృందం తెలిపారు. ఈనెల 31న గణపతిపూజ, పుణ్యహవాచనం, యంత్రపూజలు జరుగుతాయని, ఫిబ్రవరి 1న అభిషేకాలు, దీక్షహోమంతో పాటు సాయంత్రం విగ్రహ గ్రామోత్సవం, 2న విగ్రహప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి, మహా మంగళ హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'వేతనాలు పెంచాలి'

నందికొట్కూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ దినసరి కార్మికుల జీతభత్యాలు పెంచాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డికి, కమిషనర్ బేబికి వినతిపత్రం సమర్పించారు. గురువారం మున్సిపల్ దినసరి కార్మిక సంఘం ఐఎఫ్‌టియూ ఆధ్వర్యంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయం నుంచి జైకిసాన్ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియా మాట్లాడుతూ వీరిని ఆప్కాస్ విధానంలోకి తీసుకువచ్చి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, పీవోడబ్ల్యూ నాయకురాలు చూరిబి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోవిందు, కార్యదర్శి శేఖర్, కోశాధికారి తిప్పన్న, మున్సిపల్ డైలీ వేజ్ కార్మిక సంఘం అధ్యక్షుడు అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గడివేముల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో హేమసుందర్‌రెడ్డి అన్నారు. గడిగరేవులలో జొన్న పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగులో విత్తనం ఎంపిక కీలకమైందని అన్నారు. పంట కోతలో తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'బీమాతో కుటుంబానికి ధీమా'



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు బీమా చేయించుకుంటే ఆపద సమయంలో వారి కుటుంబాలకు ధీమాగా ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. వెలుగోడు సహకార సంఘంలో మోతుకూరు గ్రామానికి చెందిన శేఖరరెడ్డి ఋణం తీసుకొని జనత ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. ఆయన గత ఏడాది ప్రమాదంలో మృతి చెందారు. ఆయన పేరిట రూ.రెండులక్షల బీమా మంజూరు కావడతో గురువారం ఆయన కుటుంబ సభ్యులకు గురువారం వేల్పనూరులో ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కును అందించారు. కార్యక్రమంలో సీఈవో జమ్ములయ్య, టీడీపీ నాయకులు సుదాకరరెడ్డి, రామనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

'పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలి'

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైల పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా క్షేత్రంలోని గంగాధర మండపం నుంచి నంది సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే క్షేత్రపరిధిలోని పలు ప్రదేశాల్లో స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈవో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు గాను 8జోన్లు, 11సెక్టార్లు, 66 ప్రదేశాలను ఎంపిక చేసినట్లు వివరించారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రమణమ్మ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

'పశు సంపదను కాపాడుకోవాలి'

వెలుగోడు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ విలువైన పశు సంపదను రోగాల నుండి కాపాడు కోవాలని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి గోవిందనాయక్ సూచించారు. గురువారం వేల్పనూరు గ్రామంలో పశుసంవర్ధకశాఖ, పశు గణాభివృది సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మిషన్ లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనకు వచ్చిన లేగ దూడల యజమానులకు ఆ గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి క్రిష్టారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పశు వైద్య సిబ్బంది నాయకులు , రైతులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై విచారణ

పాణ్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజు పల్లెలో బుధవారం జరిగిన పట్టపగలు దొంగతనం కేసు ఘటనపై విచారిస్తున్నట్లు పాణ్యం పోలీసులు గురువారం తెలిపారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇంటి యజమానులు పనులకు వెళ్లడంతో మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంటిలోకి జొరబడి రెండుతులాల బంగారు, రూ.11 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు సువర్ణ పిర్యాదు చేసినట్లు తెలిపారు. చోరీ సమయంలో దొంగల ఆనవాళ్లు కనపడకుండా ఉండేందుకు ఇంటిలో కారం పొడిచల్లినట్లు తెలిపారు. ఈమేరకు విచారిస్తున్నామన్నారు.

'భక్తులకు ఎలాంటి లోటు రాకూడదు'

కొత్తపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఫిబ్రవరి 2వ తేదీన జరిగే అమ్మవారి వసంత పంచమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి లోట్లు రాకుండా చూసుకోవాలని కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకటనాయుడును స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, దేవాదాయ శాఖ అధికారి రామసుబ్బయ్యలను ఆదేశించారు. గురువారం మండలంలోని నల్లమలలో కొలువైన కొలనుభారతి పుణ్యక్షేత్రంలో అమ్మవారి వసంత పంచమి ఏర్పాట్ల వేడుకల ఏర్పాట్లను తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పరిశీలించారు. మండల సర్వేయర్ అనూష, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల విలీనం వద్దు: ఏపీటీఎఫ్

గడివేముల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల పేరుతో 2 కి.మీ దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలుపుదల చేయాలని అన్నారు. అలాగే మౌలిక వసతులు లేవన్న నెపంతో 6, 7, 8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని నిలుపుదల చేయాలని అన్నారు. 60 మంది విద్యార్థులు పైగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మానపాటిరవి, ఆవుల మునిస్వామి, ఏపీటీఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి కవిత, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

'మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి'

ఆత్మకూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలోని గీత కులాలకు మంజూరైన మద్యం దుకాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ వి.రాముడు తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. నంద్యాల జిల్లాకు మొత్తం 11 గీత కులాలకు మద్యం దుకాణాలు మంజూరు కాగా వాటిలో ఆత్మకూరు అర్బన్, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు ఒక్కో దుకాణం చొప్పున మొత్తం మూడు దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఆత్మకూరు, కొత్తపల్లి గౌడ కులానికి కాగా, పాములపాడు ఈడిగ కులానికి కేటాయించినట్లు వివరించారు. శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సున్నిపెంటలోని మద్యం దుకాణాలను ఫిబ్రవరి 24 సాయంత్రం నుంచి 27వ తేది వరకు మూసి వేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్ఐ వీరస్వామి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల జిల్లాలో కల్లుగీత కార్మికులు 11 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. గురువారం నందికొట్కూరు ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం మద్యం దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిందని చెప్పారు. గౌడ కులస్థులకు1, గౌడ్సకు-3, ఈడిగ కులస్థులకు 7 మంజూరయ్యాయన్నారు. ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: జిల్లాలో గీత కార్మికులకు 11మద్యం షాపులు కేటాయిం చినట్లు నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి గురువారం తెలిపారు. నంద్యాల ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమా వేశంలో ఆయన మాట్లా డుతూ దరఖాస్తుల స్వీకరణకు కార్యాల యంలో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబు ల్‌తో డెస్క్‌ను ఏర్పాటు చేశామని, నేరుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

'సమస్యలు పరిష్కరించకపోతే పనులు అడ్డుకుంటాం'



పాములపాడులో ప్రజలతో మాట్లాడుతున్న హైవే అధికారులు

పాములపాడు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రజల సమస్యలు పరిష్కరించకుండా పనులను చేపడితే అడ్డుకుంటామని పాములపాడు, చెలిమిళ్ళ, లింగాల గ్రామాల ప్రజలు నేషనల్ హైవే పిడీ పద్మ, అధికారులకు స్పష్టం చేశారు. పాములపాడు గ్రామ శివార్లలోని చెలిమిళ్ళ రస్తాలో హైవే పనుల నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని, సర్వీస్‌రోడ్డు నిర్మించాలని లేకుంటే దాదాపు 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని అన్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయాలి

- గ్రామ పంచాయతీ అధికారులపై మంత్రి బీసీ ఆగ్రహం


కొత్తబస్టాండ్‌లోని మురుగు కాల్వను పరిశీలిస్తున్న మంత్రి

బనగానపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని మురుగు కాల్వలను ఆయన పరిశీలించారు. డ్రైనేజీలో చెత్తాచెదారంతో పేరుకపోవడంతో గ్రామ పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా ప్రజలను చైతన్యపరుస్తూ ఆరోగ్య పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ మంత్రి మండిపడ్డారు. తక్షణమే మురుగు కాల్వల్లో చెత్తాచెదారం తొల గించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పట్టణంలో ఆర్‌అండ్‌బీ డివైడర్‌పై ఉన్న చెత్తను తొలగించి మొక్కలు నాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మద్దతు ధరకు అమ్ముకోవాలి


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, తదితరులు

బనగానపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ సూచించారు. గురువారం మండలంలోని పలుకూరు, అప్పలాపురం, తిమ్మాపురం, వెంకటాపురం, టంగుటూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పంటల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అలాగే తిమ్మాపురం గ్రామంలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా అందుబాటు ఉంచామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముల్లా జాస్మిన్ జహాన్‌కు అభినందనలు


ముల్లా జాస్మిన్ జహాన్‌ను అభినందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెకు చెందిన ముల్లాజాస్మిన్ జహాన్‌ను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అభినందించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ముల్లా జాస్మిన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్‌లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో ముల్లాజాస్మిన్ విజేతగా నిలువడం హర్షనీయమన్నారు. అలాగే ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్ -2025లో ఆంధ్రప్రదేశ్ తరుపున హాజరై 'ఉమెన్ ఇన్ పాలిటిక్స్' అనే అంశంపై తన అభిప్రాయం వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ముల్లా జాస్మిన్ ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని డి.వనిపెంట గ్రామంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని టీడీపీ నాయకుడు గోపాల్, ఏడీ ప్రారంభించారు. పశువుల వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. 98 జీవాలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేశారు. 150 పశువులు, దూడలకు వైద్య చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయి బాబా, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- పట్టించుకోని పాలకులు

డోన్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ఏళ్లగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ పని చేస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అద్దె భవనంలో నడుస్తుంది. సారా కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిలుపుకునేందుకు స్థలం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే గుత్తిరోడ్డులో ఉన్న గ్రంథాలయ భవనం అద్దె భవనంలో నడుస్తుంది. పాత భవనం కావడంతో వర్షాకాలంలో కారుతుంది. దాంతో పుస్తకాలు తడుస్తున్నాయి. వాటిని భద్రపరి చేందుకు గ్రంథాలయ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఆర్టీవో కార్యాలయం పట్టణ సమీపంలోని హైవే రోడ్డు పక్కల అద్దె భవనంలో నడుపుతున్నారు. ఆయా పనుల నిమిత్తం వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. అలాగే పలు కార్యాలయాలు ఇరుకు గదుల్లో కొనసాగుతుండటంతో ఇటు సిబ్బంది, అటు ప్రజలు అవస్థ పడుతున్నారు. వేలకు వేలు అద్దెలు చెల్లిస్తున్నా సరైన వసతులు లేవని, ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కనీసం కొన్ని చోట్ల ప్రజలు కూర్చునేందుకు కూడా వీలు లేని పరిస్థితులు ఉండటంతో ఇటు ప్రజలు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



డోన్‌లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్టీవో , ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయాలు

ప్రభుత్వ భవనాలు నిర్మించాలి



అద్దె భవనాల్లో చాలా చోట్ల కనీస వసతులు లేవు. ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తారు? అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు కేటాయించి భవనాలు నిర్మించాలి.

- తెలుగు విజయకుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు, డోన్

ప్రతిపాదనలు పంపించాం



డోన్ పట్టణ సమీపంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటుకు నాలుగెకరాల భూమిని కేటాయించారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఉన్నధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

- క్రాంతి కుమార్, ఆర్టీవో, డోన్

'ఉపాధి'లో వంద రోజులు పని కల్పించాలి

- డ్వామా పీడీ జనార్దన్‌రావు
- శిరివెళ్లలో ముగిసిన సామాజిక తనిఖీ బహిరంగ సభ
- రూ.76,796 రికవరీకి ఆదేశం


బహిరంగ సభలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన కూలీలకు తప్పనిసరిగా వంద రోజులు పని కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జనార్దన్‌రావు సూచించారు. ఏప్రిల్, 2023 నుంచి మార్చి, 2024 వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, సర్వశిక్షాఅభియాన్‌లో రూ.9.77 కోట్లతో చేపట్టిన 1,471 పనులకుగాను 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను గురువారం శిరివెళ్లలోని మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో తనిఖీ సిబ్బంది గుర్తించిన అవకతవకలను సమావేశంలో వివరించారు. రైతులకు పంపిణీ చేసిన మొక్కల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూ.4,06,900తో రీ ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లకు ఎక్కువ రోజులు పని కల్పించడం, ఆదివారం ఉపాధి పనులు చేపట్టినందుకు, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేసిన తప్పులకుగాను రూ.4,500 పెనాల్టీ, రూ.76,796 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డ్వామా సహాయప్రాజెక్టు డైరెక్టర్లు అన్వరాబేగం, బాలోజీనాయక్, విజిలెన్స్ సెక్షన్ సూపరింటెండెంట్ షీబారాణి, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ గంగాద్రి, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో రామసుబ్బయ్య, ఈసీ సుబ్బరాయుడు, హౌసింగ్, పీఆర్ ఏఈలు అహ్మద్ బాషా, రవి కుమార్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ కాంతయ్య, డీఆర్పీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

- రసాభాసగా కౌన్సిల్ సమావేశం


సమస్యలను వివరిస్తున్న టీడీపీ కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి

బేతంచెర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. టీడీపీ కౌన్సిలర్ ఆదిలక్ష్మి జోక్యం చేసుకుని గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగకున్న వైసీపీ కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీయడం సమంజసం కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా కాకుండా అభివృద్ధి గురించి నిలదీయడం సరికాదన్నారు. దీంతో కొద్దిసేపు సమావేశం రసాభాసగా మారింది. కమిషనర్ హరిప్రసాద్ స్పందించి నగర పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తామని తెలిపారు. సరైన సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ బైటిపేటలో ఉన్న బోరుకు మినరల్ వాటర్ ప్లాంటుకు పైపులైన్ ఏర్పాటు చేస్తే రైతులు ఇబ్బంది పడుతున్నారని, కొలుములపల్లె రస్తాలో ఒక బోరు ఉందని, ఆ బోరు ద్వారా వాటర్‌ప్లాంటుకు పైపులైన్ వేస్తే ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, ఆయా వార్డుల కౌన్సిలర్లు మధు, ఫాతిమా, షేక్ ముబీనా, ఇబ్రహీం, కోఆప్షన్ మెంబర్ ఎల్లయ్య , కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం తగదు

- మండల సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులకు నోటీసులివ్వండి
- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను చర్చించడానికి, మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి కీలకమైన వెలుగు (ఐకెపి)అధికారులు, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఐసీడీఎస్, ఎన్ఆర్‌ఈజీఎస్, ఆర్‌టీసీ తదితర శాఖల అధికారులు హాజరు కాలేదు. ఇందులో కొన్ని శాఖల అధికారులు ఏ మాత్రం అవగాహన లేని కింది స్థాయి సిబ్బందిని సమావేశానికి పంపడంపై జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు సరైందికాదని, గైర్హాజరైన ఆయా శాఖల అధికారులకు నోటీసులివ్వాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదిలను చదివి వినిపించారు. తాగునీటి సమస్యలపై అప్రమత్తంగా ఉండి, ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీచైర్మేన్ పాపిరెడ్డి అన్నారు. అంగన్ వాడీ కార్యాలయాల్లో మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా శాఖల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ

రుద్రవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం పోలీసుస్టేషన్‌ను ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషను పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో సమాచార సేకరణ చేయాలన్నారు. సైబర్, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ వర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన గంటల నరేష్‌పై కొండుపల్లె గ్రామానికి చెందిన పాములేటి కట్టెతో దాడి చేసి గాయపరచినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

రుద్రవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. కోటి నిధులు మంజూరైనట్లు గురువారం పంచాయతీరాజ్ ఏఈ కమాల్‌సాహెబ్ తెలిపారు.

'మధ్యాహ్నం'పై పర్యవేక్షణ కరువు

- ఆరు బయట వంటకాలు
- అపరిశుభ్రత మధ్యే విద్యార్థుల భోజనం


అపరిశుభ్రత మధ్య వంట వండుతున్న నిర్వాహకులు

కొలిమిగుండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు పందులు .. మరో వైపు కుక్కలు .. మధ్యలో విద్యార్థులు .. ఇది కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పంపిణీ పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడం, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అపరిశుభ్రత మధ్యే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మండలంలోని పెట్నికోట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 205మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఓవైపు పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని కూటమి ప్రభుత్వం మొత్తుకుంటున్నా, కొంత మంది కింది స్థాయి అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటంలేదు. సరైన వసతులు లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే, అపరిశుభ్రత మధ్య వంట చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పందులు, కుక్కలు సంచరిస్తున్న విద్యార్థులకు అపరిశుభ్రత మధ్యే మధ్యాహ్న భోజం వడ్డిస్తున్నారు. పక్కనే అవి సంచరిస్తుంటే ఓ చేతితో వాటిని తొలివేస్తూ మట్టిలో కూర్చోని విద్యార్థులు భోంచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో పర్యవేక్షించాల్సిన ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల అవస్థ వర్ణనాతీతం. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పాఠశాలలో మధ్యాహ్న భోజన పంపిణీని ఉపాధ్యాయులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

ప్రజలు మెచ్చేలా పని చేయండి

- అవినీతికి పాల్పడితే సహించం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆర్డీవో విశ్వనాథ్ విచారణ

సంజామల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వీఆర్వోలు ప్రజలు మెచ్చేలా పని చేయాలని ఆర్డీవో విశ్వనాథ్ ఆదేశించారు. ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో పైసలిస్తేనే పనులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గురువారం నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ తహసీల్దార్ అనిల్ కుమార్‌తో కలిసి విచారణ చేపట్టారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలను వేధించి మామూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఇలాంటి సంఘటణలు మరోసారి పునరావృతం అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సర్వేలను పంచాయతీ కార్యదర్శులు కలిసి వేగవంతంగా చేయాలన్నారు. రైతులు, విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు తులసి కృష్ణ, సర్వేయర్ క్రిష్ణయ్య, వీఆర్వోలు ఎరుకలయ్య, సుబ్బరాయుడు, గుర్రప్ప, చెన్నయ్య, శ్రీనివాసులు, కంబగిరి, నరసింహా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం: వీఆర్

కొలిమిగుండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కోసం చేస్తున్న సర్వేను ఆయన ప్రారంభించారు. మరోవైపు గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే కొనసాగుతోందని అన్నారు. టీడీపీ నాయకులు వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఎంపీటీసీ పెద్దన్న, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ, పెద్దిరెడ్డి, చిన్నపుల్లన్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కుష్ఠు వ్యాధిని నిర్మూలించాలి

డోన్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నిర్మూలించి, కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దామని రామదుర్గం సర్పంచ్ నాగన్న, కొత్తబురుజు ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని రామదుర్గం గ్రామంలో కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం


వివరాలు తెలుసుకుంటున్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

డోన్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఏపీ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బా రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద కడప సీడ్స్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కడప జిల్లా రైతులకు అందించే సీడ్స్‌పై ఆయన అధికారులతో చర్చించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గాంధీ సేవలు చిరస్మరణీయం


గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

చాగలమర్రి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీ సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు లక్ష్మణబాబు తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో వాసవీభవన్‌లో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ కార్యదర్శి శ్రీరామ వెంకటసుబ్రహ్మణ్యం , పీఎస్ఎస్ నారాయణ, జక్కా నాగరాజు, చిత్తలూరు ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మహ్మద్ షరీఫ్, నాయకులు

బేతంచెర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని శాసన మండలి మాజీ చైర్మన్ మహ్మద్ షరీఫ్ అన్నారు. గురువారం ప్యాపిలి మండలానికి వెళ్తూ మార్గమధ్యలో బేతంచెర్ల పట్టణంలోని ఎంపీటీసీ మాజీ సభ్యుడు జాకీరుల్లా బేగ్ స్వగృహంలో ఆయన టీడీపీ నాయకులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎవరూ కూడా నిరాశ పడ్డొదని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, నాయకులు చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, మేకల నాగరాజు, జావాజీ వెంకటేశ్వర్లు, బుక్కాపురం లక్ష్మన్న, జక్రియ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 30(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధమవుతున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు రామచంద్రుడు, నాగరాజు అన్నారు. సీపీఎం రాష్ట్ర ప్రచార జాతలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని పలు కూడళ్లలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, రమేష్, జేఏసీ నాయకులు బాషా, షేక్షావలి, వెంకటయ్య, కార్మికులు పాల్గొన్నారు.